ప్రజాశక్తి
మంగళవారం 22 నవంబర్ 2022
5
పార్వతీపురం మన్యం

నాలుగు స్థాయిల్లో ఆటల పోటీలు

కలెక్టరేట్ : ముఖ్య మంత్రి పేరున రూ.50 లక్షల నగదు బహుమతి రాష్ట్ర స్థాయి కబడ్డీ, వాలీ బాల్ (స్త్రీ పురుషులకు), క్రికెట్ (పురుషులకు) పోటీలను నియోజకవర్గ, జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడా అభివద్ధి అధికారి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని పార్వతీపురం నియోజకవర్గంలో అలజంగి జోగారావు ఆధ్వర్యంలో ఈనెల 23న పార్వతీపురం ఆర్‌సిఎం స్కూల్‌లోనూ, స్థానిక ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ఉన్నత పాఠశాల, చాకలి బెలగాం, పార్వతీపురం నందు కబడ్డీ, వాలీ బాల్ (స్త్రీ పురుషులకు), క్రికెట్ (పురుషులకు) క్రీడా అంశాల్లో నియోజకవర్గ స్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందుకు 17ఏళ్లు పైబడి డిసెంబర్ 31 నాటికి జన్మించిన వారు అర్హులన్నారు. పాల్గొనే క్రీడాకారులు ఆధార్, రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు కె.తిరుపతిరావు, ఫోన్ నెంబరు 9441415652, డిటి గాంధీ, వ్యాయమ ఉపాధ్యాయులు ఫోన్ నెంబరు 9440530997 ద్వారా సంప్రదించాలని సూచించారు.

ఓ వైపు కొలిక్కిరాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు.. మరోవైపు నత్తనడకన గృహ నిర్మాణం.. ఇంకోవైపు సంక్షేమ హాస్టళ్లలో సమస్యల తిష్ట.. ఇలా చెప్పకుంటూ పోతే ఆ రంగం, ఈ రంగం.. అనే తేడాలేదు. అన్ని రంగాల్లోనూ ప్రజల సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రమాదకర విద్యుత్తు లైన్లు తొలగించాలనే జిల్లా పరిషత్తు సమావేశాల నిర్ణయం ప్రహసనంగా సాగుతోంది. మెటీరియల్ కాంపొనెంట్ పనులు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారన్న అభియోగాలు పెరిగాయి. సమగ్ర శిక్ష ఎపిసి అక్రమంగా పోస్టులు భర్తీచేశారన్న ఆరోపణలతోపాటు కలెక్టర్‌కు తప్పడు సమాచారాలు, నివేదికలు అందజేశారన్న అభియోగాలు ఉన్నాయి. ప్రారంభం నుంచే పంటల బీమాపై 100శాతం పూర్తి చేసినట్టు నివేదిక చూపించడంతో రైతులు, ప్రజాప్రతినిధుల్లో అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఇలా చాలా సమస్యలు పేరుకుపోవడంతో నేటి జిల్లా పరిషత్తు సమావేశంలోనైనా చర్చకు వచ్చేనా? అన్నట్టుగా జనం చర్చించుకుంటున్నారు.

కొలిక్కిరాని ధాన్యం కొనుగోలు

- నత్తనడకన గృహ నిర్మాణం
- సంక్షేమ హాస్టళ్లలో సమస్యల తిష్ట
- ప్రహసనంగా ప్రమాదకర విద్యుత్తు లైన్ల తొలగింపు
- నిబంధనలకు విరుద్ధంగా మెటీరియల్ కాంపొనెంట్ పనులు
- సమగ్ర శిక్ష ఎపిసిపై ఆరోపణలు
- పంటల బీమాపై అనుమానాలు
- నేటి జిల్లా పరిషత్తు సమావేశంలో చర్చకు వచ్చేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. ముఖ్యంగా ఇరు జిల్లాల్లో వరికోతలు ప్రారంభయ్యాయి. కానీ, ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ఏర్పాట్లు అరకొరగానే ఉన్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహ నిర్మాణం నత్తనడకన సాగుతోంది. జగనన్న కాలనీలు నివాసయోగానికి అనుకూలంగా లేవంటూ చాలా చోట్ల లబ్ధిదారులు ముందుకు రాలేదు. ప్రస్తుతం అటువంటి లేఅవుట్లను రద్దుచేసేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్టు సమాచారం. ఈ నేపథ్యంలో భూమి కొనుగోలుకు ప్రభుత్వం చెల్లించిన డబ్బుల సంగతేమిటనేది చర్చనడుస్తోంది. డిసెంబర్ 21న 29 వేల ఇళ్లకు సామూహిక గృహప్రవేశాలు చేస్తామని చెబుతున్నా, ఇప్పటికి 14 వేల ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్లు ఈలోపు పూర్తయ్యే పరిస్థితి లేదు. రాష్ట్రంలోనే అతిపెద్ద లేఅవుట్‌గా చెప్పుకుంటున్న గుంకలాం జగనన్న కాలనీలో 12 వేల ఇళ్లకుగాను అక్షరాల 22 ఇళ్లకు మించి పూర్తికాలేదంటే అతిశయోక్తి కాదు. ఇందుకు ప్రధాన కారణం ప్రజల ఆర్థిక ఇబ్బందులు, ప్రభుత్వం మంజూరు చేసిన సొమ్ము సరిపోకపోవడమే. ఈనేపథ్యంలో ఇళ్లకు చెల్లిస్తున్న మొత్తాన్ని పెంచే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని సిపిఎంతోపాటు ప్రజాసంఘాలు కోరుతున్నాయి. దీనిపై జిల్లా పరిషత్తు సమావేశంలో చర్చించి తీర్మానం రూపంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుందా? లేదా? అన్నది వేచిచూడాల్సిందే.

సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు చలిని తట్టుకోలేక గజగజలాడుతున్నారు. పలు హాస్టళ్లలోని విద్యార్థులు జిల్లాలో సంచరిస్తున్న పులులు, ఏనుగుల భయంతోనే ఉన్నారు. మెనూ సరిగా అమలు చేయడం లేదంటూ విద్యార్థులు ఆందోళనలు చేశారు.

సమగ్ర శిక్ష ఎపిసి పలు పోస్టులను నిబంధనలకు విరుద్ధంగా నియమించారనే అభియోగం ఇటీవల చర్చనీయాంశగా మారింది. ఐసిడిఎస్, జిల్లా వైద్యారోగ్య శాఖలు కూడా ఇటువంటి అభియోగాన్ని ఎదుర్కొంటున్నాయి. పంటల బీమా విషయంలో రిపోర్టును వ్యవసాయ శాఖ అధికారులు అంచనాలకు మించి చూపించారనే అభియోగాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటన్నింటిపైనా చర్చ జరుగుతుందా? లేదా? అన్నదానిపై జనం ఆసక్తి ఎదురు చూస్తున్నారు.

> గ్రామాల్లో విద్యుత్తు లైన్లు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. వీటిని తొలగించాలంటూ గత రెండు, మూడు సమావేశాల్లో చర్చ సాగింది. వచ్చే సమావేశం నాటికి ఈ చర్చకు అవకాశం లేకుండా పరిష్కరించాలని కూడా గత సమావేశం ఆదేశించింది. కానీ, ఆ ప్రమాదకరమైన పరిస్థితి ఎప్పటి మాదిరిగానే ఉంది.

> పూసపాటిరేగ మండలంలో మెటీరియల్ కాంపొనెంట్ పనులను నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారన్న అభియోగంతో ఇటీవల రాష్ట్ర కేంద్రం నుంచి ప్రత్యేక బృందం విచారణ కోసం వచ్చింది. మండలమంతా ఇదే పరిస్థితి ఉందంటూ చాలా మంది కమిటీకి ఫిర్యాదు చేశారు.

> మెంటాడ మండలం పోరాం గ్రామంలోని సుమారు 232 మంది కూలీల కార్డులను గుర్తుతెలియని డ్వామా సిబ్బంది రద్దుచేశారు. వారంతా చనిపోయి నట్టుగా కంప్యూటర్‌లో పేర్కొనడంలో పనులు లేకుండా పోయారు. ఈ వ్యవహారంపై ఇద్దరు ఎపిఒ, ఫీల్డ్ అసిసెంట్లపై చర్యలు తీసుకున్నప్పటికీ కార్డులు యాక్టివ్ కాలేదు.

18 శాఖలపై కీలక చర్చ

జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశానికి మొత్తం 50 ప్రభుత్వ శాఖల అధికారులను ఆహ్వానించాం. వీటిలో 18 శాఖలకు చెందిన విజయనగరం, పార్వతీపురం జిల్లాల అధికారులను మాత్రమే తొలుత లోపలికి అనుమతిస్తాం. వీటిలో ప్రధానంగా వైద్య, విద్య, వ్యవసాయం, సివిల్ సప్లై, ఎపిఇపిడిసిఎల్, గృహ నిర్మాణం, పిఆర్, డ్వామా, కో-ఆపరేటివ్ వీటి అనుబంధ శాఖలైన పశు సంవర్థక శాఖ, సమగ్ర శిక్ష, పౌరసరఫరాల శాఖ తదితరాలు ఉన్నాయి. అనంతరం మిగిలిన శాఖలపై చర్చించేందుకు ప్రణాళిక రూపొందించాం.

\- అశోక్‌కుమార్, జెడ్‌పి సిఇఒ

26న జిల్లాకు రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ రాక

కలెక్టరేట్ : రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎం.వి.ఎస్.నాగిరెడ్డి ఈనెల 26న జిల్లాకు వస్తున్నారని జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు కె.రాబర్ట్ పాల్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక కలెక్టరేట్‌లో అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు, వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రతినిధులతో జరిగే సమావేశంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఉద్యాన కళాశాలను సందర్శిస్తారని ఆయన పేర్కొన్నారు.

కలెక్టరేట్‌లో ప్రపంచ మత్స్య దినోత్సవం

కలెక్టరేట్ : ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని కలెక్టరు కార్యాలయంలో నిర్వహించారు. నరసాపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుండి కలెక్టర్, జిల్లా అధికారులు, మత్స్యకార సంఘ నాయకులు, మత్స్యకారులు కలెక్టరు కార్యాలయం నుంచి వర్చువల్ గా వీడియా కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్య కార్పొరేషన్ డైరెక్టరు పి.పార్వతీ మురళీ కృష్ణ, జిల్లా మత్స్యకార సంఘ ఉపాధ్యక్షులు దాసరి లక్ష్మణరావు, జిల్లా మత్స్యశాఖాధికారి వి.తిరుపతయ్య, మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు డి.గోపీకష్ణ, నాగమణి, విలేజ్ ఫిషరీస్ సహాయకులు పాల్గొన్నారు.

లక్ష్యాలను చేరుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి -కలెక్టరేట్

పథకాలను సకాలంలో పూర్తిచేసేందుకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సోమవారం మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. హౌసింగుపై సమీక్ష నిర్వహిస్తూ లేఅవుట్లలో పనులు పూర్తిచేయాలన్నారు. భూసేకరణకు సంబంధించిన ఫైల్స్ వెంటనే పంపించాలన్నారు. అధికారులు ప్రతిరోజు లే అవుట్లు పరిశీలించి పనులు పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బిల్స్ వెంటనే సబ్మిట్ చేయాలని తెలిపారు. ప్రాధాన్యత భవనాలు, జలజీవన్ మిషన్ పనులు పూర్తిచేసి బిల్లులు అందజేయాలన్నారు. నాడు - నేడు పనులు పూర్తిచేయాలని, పాఠశాలలలో రిపేర్ల కోసం పాఠశాలల నిర్వహణ నిధి ఇస్తామని, వీటితో మరమ్మతులు చేసి మౌళిక సదుపాయాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జిల్లాలో 190 పాఠశాలలలకు, 92 అంగన్ వాడి కేంద్రాలకు, 8జూనియర్ కళాశాలలకు ప్రహరీ గోడలు నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని, వాటికి సంబంధించి ప్రతిపాదనలు పంపించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణకు సంబంధించి ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన నూతన సేకరణ విధానంలో ధాన్యం సేకరణ జరగాలని తెలిపారు. రెండు లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ లక్ష్యంగా నిర్ణయించామన్నారు. రైతులకు మద్దతు ధర కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ధాన్యం సేకరణ కార్యక్రమాన్ని సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని, రైతులకు మెరుగైన సేవలు, గిట్టుబాటుధర అందించాలన్నారు. సక్రమంగా సేకరణ జరిగితే మూడు, నాలుగురోజుల్లోనే రైతుకు డబ్బులు జమయ్యే అవకాశం ఉందని తెలిపారు.

వైద్యశాఖకు సంబంధించి ప్రజలందరికీ ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి ఆరోగ్య మిషన్ కార్డులు డౌన్ లోడు చేసి అందించాలని తెలిపారు. దీనికి సంబంధించిన డేటా వాలంటీరు యాప్‌లో పొందుపరచడం జరిగిందని, వారు కార్డుల డౌన్లోడ్ చేసి అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. టిబి రోగులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, సంబంధిత యాప్‌లో నమోదు చేసి వారికి ఈ అవకాశాన్ని వినియోగించుకొనేలా చూడాలని అన్నారు. ఈ పథకంలో చక్కగా పనిచేసిన అధికారులను గవర్నరు చేతుల మీదుగా సన్మానించనున్నట్టు తెలిపారు. సమీక్షా సమావేశంలో డిఎంహెచ్ఒ బి.జగన్నాథ రావు, డిఆర్‌డిఎ పీడీ డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎంవిజి కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ప్రభాకర రావు, హౌసింగ్ పీడీ పి.రఘురాం, డిఇఒ డాక్టర్ ఎస్‌డివి రమణ, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, డిఎస్‌ఒ కె.వి.ఎల్.ఎన్ మూర్తి, ఐసిడిఎస్ పీడీ జి.వరహాలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, జెసి ఆనంద్

సిఐటియు విజయనగరం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శిగా శంకరరావు, సురేష్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

సిఐటియు విజయనగరం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. రెండో జరిగిన మహాసభలో 60 మందితో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా పి.శంకరరావు, ప్రధాన కార్యదర్శిగా కె.సురేష్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా వి.రాములు, ఉపాధ్యక్షులుగా టి.సూర్యనారాయణ, టి.వి.రమణ, ఎం.శ్రీనివాస, జి.అప్పలసూరి, ఎస్.అనసూయ, మద్దిల రమణ, బూర్ల రమణ, కార్యదర్శులుగా ఎ.జగన్మోహన్, బి.సూర్యనారాయణ, వి.లక్ష్మి, బి.సుధారాణి, ఎ.గౌరినాయుడు, సిహెచ్ రామ్మూర్తినాయుడు, యుఎస్ రవికుమార్ ఎన్నికయ్యారు.

తొలిరోజు ఆదివారం భారీర్యాలీతో ప్రారంభమైన మహాసభల్లో ఎర్రజెండాను చేతబూని కార్మికులు కదం తొక్కారు. వేలాది మంది స్కీమ్‌వర్కర్లు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగసభలో రాష్ట్ర నాయకులు చేసిన ప్రసంగాలు కార్మిక వర్గంలో స్ఫూర్తిని నింపాయి. పోరాట పటిమను చెబుతూనే, కార్మికవర్గంపై ప్రభుత్వం చేపడుతున్న నిర్బంధకాండను, అణచివేత చర్యలను దునుమాడాయి. అనంతరం జరిగిన ప్రతినిధుల సభల్లో కార్మికుల పక్షాన చేస్తున్న పోరాటాలను మననం చేసుకుని, భవిష్యత్తు కార్యచరణను రూపొందించేందుకు ప్రతినిధులు సుదీర్ఘ చర్చలు చేశారు. అనంతరం పలు తీర్మానాలను సభ ముందుంచగా, ప్రతినిధులు ఏకగ్రీవంగా అమోదించారు. మహాసభల స్ఫూర్తితో కార్మికులంతా సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపు నిచ్చారు.

పి.శ్రీనివాసరావు

కె.సురేష్

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు సహకరించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు చిరు వ్యాపారులంతా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జె. రామఅప్పలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో పట్టణంలో ఉన్న పలువురు చిరువ్యాపారులతో ప్లాస్టిక్ వాడకాలతో కలిగి నష్టాలపై అవగాహన కల్పించేందుకు, ప్లాస్టిక్‌రహిత సమాజంగా పట్టణంగా తీర్చిదిద్దేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో భావి తరాలకు మంచి పర్యావరణాన్ని అందించేందుకు మన వంతు కృషిగా ప్లాస్టిక్ వాడకాలను నిలిపివేయాలని, అందుకు ముఖ్యంగా వ్యాపారస్తులు, చిరు వ్యాపారస్తులు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారి పి.కనకారావు, ప్రజారోగ్యం అధికారి సిహెచ్. మురళి, ప్రజారోగ్య సిబ్బంది, వార్డు సచివాలయాల శానిటరీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ హెచ్‌ఎంల డిడిఒ అధికారాలపై కార్యాచరణ చేపట్టాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జిఒ 180 అమలులో భాగంగా మున్సిపల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల డిడిఒ అధికారాల కోసం తదుపరి చర్యలు చేపట్టాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డిఇఒ ఎడిని కలిసి వినతిని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎంలకు ప్రభుత్వం డిడిఒ అధికారాలు కల్పించిన ప్రకారం వాటి అమలుకై జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నుండి తదుపరి కార్యాచరణ చేపట్టి పార్వతీపురం, సాలూరు మున్సిపాల్టీల్లో టీచర సంఖ్యను జిల్లా ట్రెజరీ అధికారి వారికి పంపించి, సదరు హెచ్‌ఎంలకు డిడిఒ కోడ్స్ కేటాయించమని, కోరాల్సి ఉందని అన్నారు. కావును డిఇఒ కార్యాలయం నుంచి సదరు వివరాలు డిటిఒకు సమర్పించాలని కోరారు. కార్యకమంలో మున్సిపల్ సబ్‌కమిటీ కన్వీనర్ కె.భాస్కర రావు, జిల్లా అధ్యక్షులు టిరమేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ ఎడితో మాట్లాడుతున్న యుటిఎఫ్ ప్రతినిధులు

సాగు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో గిరిజనులు సాగు చేస్తున్న భూములకు తక్షణమే పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం నాయకులు మండంగి శ్రీనివాసరావు, కె.సీతారాం ఆధ్వర్యంలో సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. తొలుత స్థానిక రావాడ కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి అక్కడ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ అనేక ఏళ్ల నుంచి గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని అన్నారు. ఏ పథకం వచ్చినా పట్టాలేదని గిరిజనులపై నిర్లక్ష్యంగా అధికారుల వ్యవహరిస్తున్నారని దీనివల్ల ప్రభుత్వ పథకాలకు గిరిజనులు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనులు సాగు చేస్తున్న కొండపోడు వ్యవసాయానికి అటవీ హక్కుల చట్టం ప్రకారం ఒక్కొక్క గిరిజన కుటుంబానికి 10 ఎకరాల భూమికి పట్టా ఇవ్వాలన్న జిఒ ఉన్నప్పటికీ అంతకంటే తక్కువ భూమికే పట్టాలిచ్చారని అన్నారు. కావున తక్షణమే ప్రభుత్వం స్పందించి గిరిజనులు సాగు చేస్తున్న భూమికి సర్వే చేయించి పట్టాలు ఇవ్వాలని, లేనిచో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్‌కు వినతిని అందించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఎం.అడ్డమేశ్వరరావు, పెద్ద ఎత్తున గిరిజనులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : అడవినే నమ్ముకొని తరతరాల నుంచి సాగు చేస్తున్న కొండపోడు భూములకు, సాగులో ఉన్న బంజర భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోలక అవినాష్ డిమాండ్ చేశారు. గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ హక్కుల చట్ట ప్రకారం సాగులో ఉన్న కొండపోడు భూములకు సంపూర్ణంగా హక్కు పత్రాలు ఇవ్వలేదన్నారు. ఇచ్చిన వారికి కూడా 20 సెంట్లు 30 సెంట్లు చొప్పున ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. సాగు చేస్తున్న గిరిజనులకు 10 ఎకరాలకు తగ్గకుండా పోడు పట్టాలు మంజూరు చేయాల్సి ఉన్నా అలా హక్కు పత్రాలు ఇవ్వలేదన్నారు. దీంతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ప్రభుత్వ భూములు సాగులో ఉండి పట్టాలు లేని గిరిజనులకు సర్వే చేసి పట్టాలు ఇవ్వాలని కోరారు. జిసిసి ద్వారా నిత్యావసర సరుకులు, పంచదార, కందిపప్పు ఇవ్వాలని, అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయాలని, నూతన అటవీ పాలసీ బిల్లు 2022 రద్దు చేయాలని, అటవీ హక్కుల చట్టం పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘ మండల కార్యదర్శి పువ్వల తిరుపతిరావు, నాయకులు సన్యాసిరావు, మోహన్ రావు, అడిత్, పాండు పలువురు గిరిజనులు ఉన్నారు.

పాచిపెంట : అటవీ హక్కు చట్టప్రకారం ప్రతి గిరిజనుడి కొండపోడు భూములకు పట్టాలివ్వాలని గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. మండలంలోని మంచాడ వలసలో దాదాపు 60 కుటుంబాలు పైగా అటవీ పోడు భూములు సాగు చేస్తున్నారని అయితే అధికారులు కాలయాపన చేస్తూ వీరికి పట్టాలు ఇవ్వకుండా ఆఫీసుల చుట్టూ తిప్పుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో అన్సర్వే భూములు సర్వేలు చేసి గిరిజనులకు, పేదలకు సాగు హక్కులు కల్పించాలని కోరారు. అనేక ఏళ్లుగా సాగు చేస్తున్న భూములపై హక్కులు కల్పించకపోవడంతో కొంతమంది రికార్డులను తారుమారు చేసి తమ భూములను స్వాధీనం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఇప్పటికైనా అధికారులు యుద్ధ ప్రాతిపదికన సర్వేలు జరిపి పేదలకు, గిరిజనులకు హక్కులు కల్పించాలని కోరారు. దీనికి తహశీల్దార్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి జిల్లా అధికారుల సహకారం తీసుకుని కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బొడ్డ స్వాములు, లక్ష్మణరావు, తవుడు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

సాలూరు: సాలూరు, పాచిపెంట మండలాల్లో గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని కోరుతూ ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన సోమవారం గిరిజనులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సంఘం మండల కార్యదర్శి వంతల సుందరరావు ఆధ్వర్యాన గిరిజనులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు సాగు చేసి సర్వే చేసిన భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని కోరారు. సారిక, జిల్లేడు వలస, పట్టు చెన్నూరు పంచాయతీ ల్లో సాగు చేస్తున్న అన్ సర్వే భూములను సర్వే చేయాలన్నారు. బొబ్బిలి మండలం నిమ్మల పాడు, సిహెచ్ బొడ్డవలస రెవెన్యూ పరిధిలో బాగువలస, పెదబోరబంద గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. పాచిపెంట మండలం మోసూరు రెవెన్యూ పరిధిలో బట్టివలస గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, నాయకులు టి.గాసి పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో గిరిజనులు, పేదలు ధర్నా

సాలూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

గుమ్మలక్ష్మీపురంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

సీతంపేట మండల కేంద్రంలో మానవహారం చేస్తున్న గిరిజన జెఎసి నాయకులు

శామ్యూల్ కమిషన్ రద్దు చేయాలి

గిరిజన జెఎసి ఆధ్వర్యాన భారీ ర్యాలీ, నిరసన

ప్రజావక్తి - సీతంపేట

జిఒ 52ను, శామ్యూల్ కమిషన్ రద్దు చేయాలని గిరిజన సంఘాల గిరిజన జెఎసి ఆధ్వర్యంలో సంఘాలు సంత మార్కెట్ నుంచి ఐటిడిఎ వరకు ర్యాలీ నిర్వహించాయి. జీవో నెంబర్ 52 రద్దు చేయాలని, ఐటిడిఎను సీతంపేటలోనే కొనసాగించాలని, అగ్రకులాలైన బోయ, వాల్మీకి, బెంతు ఒరియాలు, ఏ ఇతర కులాలను ఎస్టీ జాబితాలోని చేర్చరాదని నినాదాలతో సీతంపేట మారుమోగింది. ఏజెన్సీ గిరిజనులంతా ఉదయం 6 గంటలకే సీతంపేట చేరుకున్నారు. అనంతరం స్థానిక బస్టాండ్ వద్ద మానవహారం చేపట్టారు. అనంతరం అక్కడ నుంచి ఐటిడిఎ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఐటిడిఎ ముఖద్వారం వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ జీవో 52 రద్దు చేయాలని, శామ్యూల్ ఏకసభ్య కమిషన్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 3ను పునరుద్ధాటించాలన్నారు. ఎల్‌టిఆర్ కేసులను పరిష్కరించాలన్నారు. గిరిజన చట్టాలను అమలు చేయాలన్నారు, బోయ, బెంతుఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చంచవద్దని డిమాండ్ చేశారు. అనంతరం ఐటిడిఎ పిఒ బి.నవ్యకు వినతిని అందజేశారు. ఈ సమస్యను ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్తానని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణ, ఎఎంసి చైర్మన్ మోహన్ రావు, గిరిజన జెఎసి రాష్ట్ర నాయకులు బిడ్డక తేజేశ్వరరావు, పాలక పురుషోత్తం, గేదెల రవిప్రమోద్, మూటక రవి, శ్యాంబాబు, ఉమామహేశ్వరరావు, సింహాచలం, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ నిమ్మక జయకృష్ణ, పడాల భూదేవి, సవరతోట మొగలింగం, జనసేన నాయకులు కూరంగి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆల్‌రౌండ్ ఛాంపియన్‌గా సీతంపేట

ప్రజావక్తి - సీతంపేట

జాతీయ గౌరవ దివాస్ గిరిజన గౌరవ దినోత్సవ ఉత్సవాల్లో భాగంగా విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయి సాంస్కృతిక, క్రీడా పోటీల్లో స్థానిక ఐటిడిఎ ఆల్ రౌండ్ ఛాంపియన్‌గా నిలిచిందని స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి ఎన్.జాకబ్ దయానంద్, ఎఎంఒ పి.కోటిబాబు తెలిపారు. ఖోఖో, కబడ్డీ ఆల్‌రౌండ్ ఛాంపియన్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం వచ్చింది అన్నారు. పాడేరు ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ, జీసెస్ ఎండి సురేష్‌కుమార్ చేతుల మీదుగా షీల్డ్ అందుకున్నారని తెలిపారు.

వైద్యాదికారి నవీన్‌ను అభినందిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, డిఎంహెచ్ఒ

వైద్యాధికారులకు కలెక్టర్ ప్రశంసలు

పార్వతీపురంరూరల్ :మండలంలోని డోకిశిల పిహెచ్‌సి వైద్యాధికారులు నవీన్, ఐశ్వర్య ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టి ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో నిర్వహించిన సేవలకు గానూ సోమవారం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి బిజగన్నాధరావు చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ రోగులకు ఉత్తమ సేవలు అందించాలని ఈసంధర్భంగా జిల్లా అధికారులు వారిని కోరారు.

వాహన చోదకులు నిబంధనలు పాటించాలి

కురుపాం : స్థానిక బస్టాండ్ వద్ద ఎల్విన్‌పేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సోమవారం వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాహన చోదకులతో మాట్లాడుతూ తప్పనిసరిగా ద్విచక్ర వాహనం నడిపేవారు, హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, అన్ని అనుమతి పత్రాలతో పాటు లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండే వారే వాహనాన్ని నడపాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులుగా శ్రీనివాసరావు

భామిని : జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ సభ్యుడిగా మండలంలోని లోహారిజోలకు చెందిన పిరపాక శ్రీనివాసరావును నియమిస్తూ కలెక్టర్ నిశాంత్ కుమార్ జారీ చేసిన ఉత్తర్వులను ఎమ్మెల్యే వి.కళావతి చేతుల అందుకున్నారు. ఈ నియామకం పై పలువురు గిరిజన నాయుకులు హర్షం వ్యక్తం చేశారు.

దిశ యాప్‌పై అవగాహన

భామిని : స్థానిక ఆదర్శ పాఠశాలలో దిశ పోలీస్ స్టేషన్ మహిళా ఎస్ఐ బి.రేవతి ఆధ్వర్యంలో దిశయాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఆడపిల్ల చరవాణిలో దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయాలని, ఆపద సమయంలో ఈ యాప్ ద్వారా కుటుంబ సభ్యులుకు, సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం చేరి మీకు అన్ని సందర్భాల్లో రక్షణ కల్పిస్తుందని అన్నారు. దిశ యాప్ వినియోగం, ఇన్‌స్టాలేషన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌సి ఎస్. ప్రతాప్, పోలీసులు ఎం.క్రాంతి కుమార్, నవీన్ కుమార్, మహిళా పోలీస్ చందన, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ ఉన్నారు.

సాగునీటి సరఫరా నిలుపుదల

పాలకొండ రూరల్ : తోటపల్లి పాత ఎడమ, కుడి ప్రధాన కాలువల ద్వారా సరఫరా చేస్తున్న సాగునీటిని కాలువల ఆధునీకరణ పనుల దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 26నుంచి నీటిసరఫరా నిలిపివేస్తున్నట్టు ఇరిగేషన్ డిఇఇ డి.రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, ఆయకట్టుదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. అలాగే కుడి, ఎడమ ప్రధాన కాలువల ఆధునీకరణ పనులు డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభమవుతాయని అన్నారు.

వికలాంగుల సదరం ధ్రువపత్రాలు పరిశీలన

సీతానగరం :మండలంలోని జోగింపేటలో సోమవారం వికలాంగుల సదరం సర్టిఫికెట్లను మండల పరిషత్ అధికారి ఎంఎస్ఎన్ ప్రసాద్ తనిఖీ చేశారు.పతి ఇంటికీ వెళ్లి సదరం సర్టిఫికెట్‌లో అంగవైకల్యం క్షేత్ర శాతాన్ని పరిశీలించి పెన్షన్ వస్తుందా రాలేదని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ కె.సింహాచలం, పంచాయతీ కార్యదర్శులు కిరణ్, పైడిరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొట్టుగుమ్మడిలో బాదుడే బాదుడు

వీరఘట్టం : మండలంలోని కొట్టుగుమ్మడలో సోమవారం పాలకొండ టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తున్నామని చెప్పిన జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, పి.కృష్ణమూర్తి నాయుడు, పి నాగేశ్వరరావు, జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, ఎన్.శశికుమార్, చింత ఉమామహేశ్వరరావు, కొట్టుగుమ్మడ, గడగమ్మ సర్పంచులు ఉదయాన రాజేశ్వరి, సూర్యనారాయణ, పి.మోహన్‌రావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పశువుల కంటెయినర్ స్వాధీనం

సాలూరు : ఒడిశా నుంచి 30 ఆవులను కంటెయినర్‌లో తరలిస్తుండగా రూరల్ పోలీసులు సోమవారం జీగిరాం వద్ద పట్టుకున్నారు. ఒడిశాలోని కొట్టుపాడు నుంచి మానాపురానికి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో జీగిరాం వద్ద పట్టుకున్నారు. రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి ఆధ్వర్యాన పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్ కుమన్ హరిజన్, యజమాని జి.సునాను అరెస్టు చేశారు. వారిపై కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన వైద్యులు

గుమ్మలక్ష్మీపురం :మండలంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో కొత్తగా నియమితులైన వైద్యులు కురుపాం ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. భద్రగిరిలో గైనకాలజిస్ట్ వైద్యులు ఇద్దరు, ఇఎన్‌టి ఒకరు, మత్తుమందు వైద్యులు విధుల్లో చేరారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే శ్రీవాణి కోరారు. ఆసుపత్రిలో వైద్యులు చేరడం పట్ల గుమ్మలక్ష్మీపురం ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

సీతంపేట : విద్యార్థులను చదివించేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ప్రధానోపాధ్యాయులు కె.సుబ్బారావు అన్నారు. మండలంలోని దోనుభాయి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునేలా తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ ఉత్తర రావు తదితరులు పాల్గొన్నారు.

వరి కోతకు వర్ష భయం

భామిని : వాయుగుండ హెచ్చరికలతో పండిన వరి పంటను కోయాలా వద్దా అన్న సందిగ్ధంలో రైతులు పడ్డారు. వరి పంట కోసిన తర్వాత వర్షం పడితే పరిస్థితి ఏమిటని, తడిచిన ధాన్యం తేమ పేరుతో కొనేవారు కరువవుతారని ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే మొదటిసారి వర్షం ప్రభావంతో పత్తి కాయలు రాలిపోయి నష్టం వచ్చిందని, ఇప్పుడు వర్షాలు పడితే రెండో కాపు వచ్చి నిలుస్తుందని, కనీసం పెట్టుబడి అప్పులు అయినా తీరుతాయని పత్తి రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ద్విచక్ర వాహనానికి వేలం

గుమలక్ష్మీపురం : : మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో నాటు సారా కేసులో స్వాధీనుపర్చుకున్న ద్విచక్ర వాహనం (హీరోఐ స్మార్ట్)ను మంగళవారం కురుపాం పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలంపాట వేస్తున్నట్లు ఎస్ఐ వి.షణ్ముఖ రావు తెలిపారు. ఈ మేరకు ఆసక్తి గల వారు ఈ వేలంలో పాల్గొని వాహనాన్ని దక్కించుకోవచ్చన్నారు.

కూలిన మర్రి చెట్టు... ప్రజలకు తప్పని అవస్థలు

పాలకొండ రూరల్ : పట్టణ పరిధిలో వెంకటరాయుని కోనేరు గట్టుపై పెద్ద మర్రి వృక్షం నెల రోజుల క్రితం చెరువు గట్టుకు అడ్డంగా కూలిపోయింది. దీన్ని తొలగించకపోవడంతో కాలేజీకి వెళ్లే విద్యార్థులు, ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మర్రి చెట్టు కూలిపోయి సుమారు రెండు నెలలు కావస్తున్నా తొలగించకపోవడం దారుణమంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుకు అడ్డంగా కూలిపోయిన భారీ వృక్షం

స్పందనకు 91 దరఖాస్తులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రతి సోమవారం మాదిరిగా ఈ సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 91 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ నిశాంత్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ పి.విష్ణు చరణ్, డిఆర్ఒ జె.వెంకట్రావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. స్పందనలో వచ్చిన అర్జీలపై వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా అధికారులను కలెక్టరు ఆదేశించారు. స్వీకరించిన అర్జీల వివరాలు కొన్ని....

భామిని మండలం మనుమకొండలో సర్వే నెంబర్ 57-1 గల 14.96 ఎకరాల భూమిని 42 మంది గిరిజన కుటుంబాలు 20ఏళ్లుగా సాగు చేస్తున్నాయని, వీరికి పట్టాదారు పాసుపుస్తకం ఇప్పించాలని నిమ్మల అన్నయ్య, గ్రామస్తులు వినతిని అందజేశారు. సాలూరు మండలం దలేవలసకు చెందిన గ్రామస్తులు వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవాలనే ఉద్దేశంతో వ్యవసాయ బోర్లు మంజూరు చేయాలని, త్రీఫేస్ కరెంటు ఏర్పాటు చేయాలని ముvvల కమ్మయ్య, గ్రామస్తులు అర్జీ అందజేశారు. సీతంపేట మండలం కొత్తగూడకు చెందిన ఎస్.సుశీల తమ గ్రామానికి పంచాయతీ కార్యాలయాన్ని మంజూరు చేయాలని కోరారు. జమ్మడుగూడ నుంచి బంబడగూడ బిటి రోడ్డు పనులు తక్షణమే పూర్తి చేయాలని ఆమకో కోరారు. గుమ్మలక్ష్మీపురం మండలం పి.ఆమిటిలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన ఎం.వల్లభుడు కోరారు. అలాగే వంజరపుగూడకు చెందిన ఎం.అనంతరావు తాను సాగుచేసుకుంటున్న అటవీ సాగు భూమిని సర్వే చేసి, సాగుభూమికి పట్టా ఇప్పించాలని కోరారు. సీతంపేట నుంచి పార్వతీపురం రావడానికి సరైన రోడ్డు సదుపాయం లేదని, నిధులు మంజూరైనప్పటికీ నిర్మాణం పనులు నేటికీ పూర్తికాలేదని వెంటనే రోడ్డు పనులు మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎం.సవరు కోరారు. ఇదే గ్రామంలో ఉపాధి హామీ ద్వారా చెరువు పనులు చేపట్టారని, కానీ నేటికీ పూర్తి కాలేదని దీంతో వర్షం కురిస్తే వీధిలోకి నీరు బురదతో నిండిపోతుందని కావున చెరువు పనులు త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా ఆయన కోరారు. కొమరాడ మండలం రావికల్లవలసకు చెందిన వి.శంకరరావు తనకు మూడు చక్రాల బండిని ఇప్పించాలని కోరారు. పార్వతీపురం మండలం బలగుడబకు చెందిన సత్తి సరోజిని కొత్త రేషన్ కార్డు మంజూరు చేయాలని, కృష్ణపల్లికి చెందిన పి.సుందరమ్మ పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీసు శాఖలో..

పార్వతీపురంరూరల్ : జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి వచ్చే దరఖాస్తులు సత్వరమే పరిష్కరించడానికి ప్రత్యేక కార్యాచరణ నిర్వహించాలని అడిషనల్ ఎస్పీ దిలీప్‌కుమార్ అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆరు దరఖాస్తులు రాగా, ఫిర్యాదుదారులతో ప్రత్యేకంగా ఎస్పీ మాట్లాడి, సంబంధించిన పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్ఒలతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు కనుక్కొన్నారు. అనంతరం ఆయన దరఖాస్తుదారులతో మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమం సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ దినకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ సోషల్ ఆడిట్

మక్కువ : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోషల్ ఆడిట్ ప్రజా వేదిక మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపిడిఒ దేవకుమార్ తెలిపారు. మండలంలోని 2020-21,22లో జరిగిన ఉపాధి పనులపై 15, 16 విడత సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ప్రజాసదస్సుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, హాజరవ్వాలని కోరారు.

బాధితురాలికి బీమా చెక్కును అందజేస్తున్న కౌన్సిలర్ కాంతారావు

వైఎస్ఆర్ బీమా అందజేత

పాలకొండ : పట్టణంలోనిభాసూరువారి వీధి 9వ నెంబర్ సచివాలయంలో నెయ్యిలవీధిలో నివాసం ఉంటున్న జంప శేఖర్ ఇటీవల మరణించడంతో ఆయన భార్య లక్ష్మికి వైయస్సార్ బీమా రూ.10 వేలును 13వ వార్డుకౌన్సిలర్ భాసూరు కాంతారావు సోమవారం అందజేశారు. మిగిలిన రూ.90 వేలు నామిని వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్టు సచివాలయ సిబ్బంది శివకష్ణ, వాసుదేవరావు తెలిపారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు కె.విజయ్ కుమార్, వాలంటీర్లు పాల్గొన్నారు.

కళాకారుడు సత్యనారాయణ మృతి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలం లోని పెదమేరంగికి చెందిన మాజీ కమ్యూనిస్టు కార్యకర్త, కళాకారుడు మరడాన సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. ఈయన 1960లో కమ్యూనిస్టు పార్టీలో చేరి పార్టీకి సేవలందించారు. ఆదిభట్ల కైలాసం, వెంపటాపు సత్యంతో పనిచేశారు. అభ్యుదయ భావాలతో అభ్యుదయ గీతాలను ఆలపిస్తూ ప్రజలను చైతన్యవంతం చేయడంలో ఆయన కృషి చేశారు. అభ్యుదయ నాటికలను వేస్తూ కళాకారుడిగా ప్రజలను చైతన్యపర్చడంలో, అక్షర విజయం కార్యక్రమం ద్వారా అందరూ చదువుకోవాలని ప్రభుత్వం చేపట్టిన కళా జాతరలో పాల్గొని తన గళాన్ని వినిపించారు. సత్యం మతి చెందిన విషయం తెలుసుకున్న కురుపాం ఎమ్మెల్యే పి.పుష్పవాణి, అరుకు పార్లమెంటు అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజ్ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. సత్యం మృతి కళారంగానికి తీవ్ర లోటని రౌతు వాసుదేవరావు సంతాపం తెలిపారు. సత్యంకు నివాళ్లు అర్పించిన వారిలో సిపిఎం నాయకులు కొల్లి గంగు నాయుడు, కె.గౌరీశ్వరరావు, బివి రమణ, ఎన్. వై నాయుడు, న్యాయవాది రౌతు అజయ్ కుమార్, వైసిపి మండల కో-ఆర్డినేటర్ మరడాన కిశోర్ ఉన్నారు.

ఉపాధిహామీ అధికారుల పనితీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని ఉపాధిహామీ అధికారుల పనితీరుపై పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపిపి ఎం.నారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు శాఖల అధికారుల పనితీరును ప్రజా ప్రతినిధులు ఎండగట్టారు. ముఖ్యంగా ఉపాధి హామీ అధికారులు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని కొటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడుతో మరికొంతమంది సభ్యులు ఎపిఒ మహేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చట్టం ద్వారా రోడ్లు, ప్రహరీ గోడలు, కొన్ని భవనాలు నిర్మించి నెలలు గడిచినా బిల్లులు చెల్లించడంలేదని ఆరోపించారు. అలాగే విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుందని ఎపిఒను నిలదీశారు. అలాగే ఉపాధి హామీ ద్వారా ఇళ్ల బిల్లులు లబ్ధిదారులకు సకాలంలో అందడంలేదని దీనికి ప్రధాన కారణం ఉపాధి హామీ సిబ్బంది నిర్లక్ష్యమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాక ఎపిఒ సిబ్బందిని సమన్వయం చేసుకోకపోవడం వల్లే ఈ ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. అలాగే మండలంలో విద్యుత్ శాఖ పనితీరు బాగోలేదని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు మాట్లాడుతూ రబీ సీజన్‌కు ఎరువులు సిద్ధం చేశామని త్వరలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు అందజేస్తామని తెలిపారు. జెడ్‌పి వైస్ చైర్మన్ కె.సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలో పలు గ్రామాల్లో తాగునీరు సమస్య ఉందని, పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను కోరారు. మోదుగ పంచాయతీ మెట్టవలస సార్లపాడు, పర్తపురం, మిలియకొంచూరు పంచాయతీ తాడివలస పాఠశాలలకు ఉపాధ్యాయుల్లేరని, దీంతో గిరిజన విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని, ఆయా పాఠశాలల్లోఉపాధ్యాయులు నియమించాలని సర్పంచులు, జెడ్‌పివైస్‌చైర్మన్ ఎంఇఒను కోరారు. అలాగే కొండలుద్దండి పాఠశాల భవనం పూర్తిగా మరమ్మతులకు గురై కూలేందుకు సిద్ధంగా ఉందని కొత్త భవనం నిర్మించాలని ఎంపిటిసి సభ్యులు కోరారు. అలాగే పలు శాఖల పనితీరుపై చర్చించారు. సమావేశంలో ఎంపిడిఒ లక్ష్మీకాంత్, తహశీల్దార్ ఆర్.రాజశేఖర్, వైస్ ఎంపిపి కె.రవీంద్ర, ఎం.మధుసూదనరావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎపిఒపై ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

కట్టెలపై వంటలు.. విద్యార్థుల ఆరోగ్యానికి మంటలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు శుభ్రమైన ఆహారాన్ని అందించాల్సి ఉండగా కట్టెలపై వంటలతో వారి ఆరోగ్యాన్ని మంటలు పెట్టిస్తున్నాయి. గ్యాస్ పొయ్యిలపై వంటలను చేసి విద్యార్థులకు వండి పెట్టాల్సి ఉండగా అవి మూలన పడేసి, కర్రల పొయ్యిలపైనే ఆహారాన్ని వండి విద్యార్థులకు అందిస్తుండడంతో అనారోగ్యానికి గురికావాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. సుచి రుచికరమైన ఆహారం అందించాలంటే కట్టెల పొయ్యిపైన అందించలేరు. మండలంలోని టికె జమ్ము ఆశ్రమ పాఠశాలలో కట్టెల పొయ్యిపై వంట చేయడం దర్శనమిచ్చింది. ఈ పాఠశాలలో 250 మంది విద్యార్థినిలు చదువుతున్నారు. సుదూర గ్రామాల నుంచి వచ్చిన వీరు ఆశ్రమ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. ఇలా కట్టెల పొయ్యల పైన వంటలు చేయడంతో విద్యార్థినుల ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడే అవకాశం లేకపోలేదు. ఇలా వండే అన్నం, కూరల్లో దుమ్ము, ధూళి పడి వంటలు కలుషితం అయ్యే ప్రమాదం ఉంటుంది. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు కూడా ఎప్పుడో సరఫరా చేసిన గ్యాస్ పొయ్యిలు మూలన పడ్డాయి. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు తగ్గట్టుగా గ్యాస్ పొయ్యాలను కూడా సరఫరా చేయాల్సి ఉండగా ఆ దిశగా ఉన్నతాధికారులు దృష్టి పెట్టడం లేదు. సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామంటున్న ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం లేదు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యాన్ని కూడా అందించాల్సి ఉండగా దాన్ని గాల్లోకి వదిలేసి విద్యార్థుల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి తమ పిల్లలకు చదువుతో పాటు ఆరోగ్యంపైనా దృష్టిసారించాలని కోరుతున్నారు.

కట్టెలపై వండుతున్న వంటలు

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ జగ్గారావు

వాటర్ షెడ్ అభివృద్ధి పనులకు ప్రణాళిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని తాడికొండ సచివాలయంలో సోమవారం సర్పంచి మండంగి జగ్గారావు అధ్యక్షతన వాటర్‌షెడ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 353 హెక్టారుల్లో వాటర్ షెడ్ పనుల కోసం రూ.77.66 లక్షల మంజూరైందన్నారు. గుమ్మలక్ష్మీపురం ప్రాజెక్ట్ వాటర్ షెడ్ ఆఫీసర్ రెడ్డి పోలినాయుడు మాట్లాడుతూ తాడికొండ మైక్రో వాటర్ షెడ్ పరిధిలో గల గ్రామాల్లో ప్రవేశిక కార్యక్రమంలో భాగంగా రూ.1.50 లక్షలు గ్రామ పంచాయతీ అవసరాల నిమిత్తం వినియోగిస్తున్నట్టు తెలిపారు. 2022- 23 సహజ వనరుల యాజమాన్యంలో భాగంగా రూ.9.59 లక్షలతో 12 పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పనుల కోసం ప్రణాళికలు తయారుచేసి ప్రజలు, పంచాయతీ తీర్మానం జరిగిందన్నారు. వాటర్ కార్యక్రమాన్ని వినియోగించుకుని జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలని కోరారు.

ఎంపిడిఒతో మాట్లాడుతున్న పెదబోగిలి గ్రామ ప్రజాప్రతినిధులు

పంచాయతీ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదబోగిలి గ్రామ సమస్యలు పరిష్కరించాలని ఉపసర్పంచ్ కె.అరవింద్ కుమార్, వార్డు మెంబర్లు పిన్నింటి రామారావు, బురిడి రామారావు, ఎంపిటిసి సభ్యులు బురిడి సూర్యనారాయణ, ఎస్.గౌరీకిషోర్, వైసిపి నాయకులు ఆర్‌వి పార్థసారథి ఎండిపిఒ బి.కృష్ణమహేష్‌రెడ్డిను సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో అనేక వీధుల్లో పారిశుధ్యం మురుగునీరు నిల్వ, విద్యుత్ దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై అనేకమార్లు సర్పంచికి, ఇఒకు తెలిపినా స్పందించడం లేదని అన్నారు. అలాగే గతంలో పంచాయతీ పరిధిలో బొడ్డుపేట, గూడెంవీధిలో కాలువలు రోడ్లు నిర్మాణం చేసినప్పటికీ ఇప్పటికీ బిల్లులు కాలేదని అప్పయ్యపేట ఎంపిటిసి సభ్యులు బి.సూర్యనారాయణ తెలిపారు. పాత బిల్లులు కాకముందే కొత్త పనులకు బిల్లులు మాత్రం సర్పంచ్ చేయించుకుంటున్నారని వారు ఆరోపించారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎం.వెంకటరమణ, టి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కుష్టు వ్యాధిగ్రస్తుల సర్వే

ప్రజాశక్తి - సీతానగరం

జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదంకలాం, సుమిత్రాపురం సోమవారం ఇంటింటి సర్వే చేశారు. ఈ సర్వేను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు పర్యవేక్షించారు. వైద్య సిబ్బంది సర్వే చేసిన రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అలాగే ఈ కార్యక్రమం ఆవశ్యకతపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ వ్యాధి నివారణకు అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే ఈ వ్యాధి ద్వారా అంగ వైకల్యం(లెప్రోసీ గ్రేడ్ -2) ఉన్న వారికి ప్రభుత్వం పెన్షన్ అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాధాకాంత్, ఇఒ సూర్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ప్రాజెక్టు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణ ప్రజలకు పూర్తి స్థాయిలో సమగ్ర తాగునీటిని అందించేందుకు ఎఐఐబి సహకారంతో ఈ పథకం మంజూరైన విషయం తెలిసిందే. ఈ పథకానికి సంబంధించి పైపులను వేసేందుకు పనులు సోమవారం ప్రారంభమైయ్యాయి. ఇందులో భాగంగా తోటపల్లి రిజర్వాయర్ నీటి వసతిని ఉపయోగించుకుని 12 వేల కుటుంబాలకు కొళాయి కనెక్షన్లు మంజూరుకు 2047 నాటికి పట్టణ జనాభాకు నీటి అవసరాలకు సరిపోయేలా ప్రాజెక్టును రూపకల్పన చేశారు. రోజుకు కుటుంబానికి 135 లీటర్లు చొప్పున సరఫరా చేసేందుకు, 63.88 కిలో మీటర్ల మేర పైపులైన్లు వేస్తారు. ప్రస్తుతం పట్టణంలో 7,477 కుళాయిలు ఉన్నాయి. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే పట్టణ ప్రజలకు నిరంతరం పుష్కలంగా తాగు నీటి సరఫరా జరిగేందుకు అవకాశం ఉంటుంది.

సీతానగరం పిఎసిఎస్ అధ్యక్షులుగా కూర్మారావు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక పిఎసిఎస్ సొసైటీ అధ్యక్షులుగా ఎస్.కూర్మారావును నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు సోమవారం ఈ ఉత్తర్వులను ఎమ్మెల్యే అలజంగి జోగారావు కూర్మారావుకు అందజేశారు. ఉత్తర్వులు అందుకున్న కూర్మారావు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

నడుకూరులో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలం నడుకూరులో సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మందికి వివిధ రకాల తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జనార్ధనరావు, పిహెచ్ఎన్ పార్వతి, హెల్త్ సూపర్వైజర్లు శాంతికుమారి, ఎఎన్ఎం సరస్వతి, ఎంఎల్ఒ అనూష, టెక్నీషియన్ దినేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సహాయం

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

మండలంలోని బుక్కురులో ఈనెల 12న జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన పొట్నూరు పార్వతమ్మ కుటుంబానికి ఐద్వా గ్రామ అధ్యక్షులు జి.పద్మ చేతుల మీదుగా సోమవారం రూ.1600 నగదుతో పాటు 10 కేజీల బియ్యాన్ని అందించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఎన్.హిమప్రభ, పి.శ్రీదేవి, టి.దివ్య, పి.రామలక్ష్మి, వై. ఇందిర పాల్గొన్నారు.

పాత బస్టాండ్‌ను పట్టించుకోండి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక పాత బస్టాండ్‌ను పట్టించుకోవాలని జనసేన నాయకులు జిల్లా జాయింట్ కలెక్టర్ ఓ. ఆనంద్‌ను కోరారు. సోమవారం స్పందన కార్యక్రమంలో జెసిని జనసేన నాయకులు వి.దాలినాయుడు, రాంబాబు, బంటు శిరీస్ తదితరులు కలిశారు. పాత బస్టాండు, రాయగడ రోడ్డు, దీప్తి లాడ్జింగ్ ప్రాంతాల్లో రోడ్డులో పెద్దపెద్ద గోతులు పడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రహదారి గుండా ఒడిస్సా కు వందలాది వాహనాలు ప్రతిరోజు రాకపోకలు సాగిస్తున్నాయని, అందులో ఎక్కువగా భారీ వాహనాలు ఉన్నాయన్నారు. దీంతో వాహనం వచ్చిన ప్రతిసారీ దుమ్ము, ధూళి రేగి అక్కడ ప్రజలు నివసించలేని పరిస్థితి నెలకొందన్నారు. కొత్త రోడ్లు వేయకపాయినా, కనీసం గోతుల నైనా పూడ్చాలని కోరారు.

వైభవంగా ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణం

పాలకొండ : పట్టణంలోని వెంకంపేట కోనేరు గట్టుపై గల ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతీల కల్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. సుమారు 50 మంది దంపతులు స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. కోటదుర్గ ఆలయం ప్రధాన అర్చకులు ద్వార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ పర్యవేక్షణలో అర్చక బృందం స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ అర్చకుడు ఆదివన్ని మల్లిఖార్జున స్వామి ఆధ్వర్యంలో ముందుగా స్వామి విగ్రహాలను ఊరేగించారు. అనంతరం స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - భామిని

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయమే ప్రభుత్వ లక్ష్యమని పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. మండలంలోని బురుజోలలో సోమవారం గడప -గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల భవనం పూర్తిగా పాడైందని కొత్త భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు కోరగా, అందుకు హామీ ఇచ్చారు. స్థానిక ఎస్‌టి వీధిలో మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని ఆ వీధి వాసులు కోరారు. కార్యక్రమంలో ఎంపిపి తోట శాంతికుమారి, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి ప్రసాదరావు, సర్పంచ్ మడపానా కేశవ పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పనుకువలస పంచాయతీ పెద్దచీపురువలస వద్ద గల పారమ్మ కొండ వద్ద సోమవారం శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని పనుకువలస పంచాయతీ పరిధిలో గల పలు గ్రామాల గిరిజనుల ఆధ్వర్యంలో జరిగింది. సర్పంచ్ సిహెచ్ సీతారామకృష్ణ చేతుల మీదుగా స్వామివారికి పట్టు వస్త్రాలు అందజేశారు. కల్యాణానికి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ వందల సంఖ్యలో భక్తులు కల్యాణానికి హాజరయ్యారు. అనంతరం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పిన్నింటి ప్రసాదబాబు ఆధ్వర్యంలో ప్రతి సోమవారం పేద ప్రజల ఆకలి తీర్చేందుకు నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్‌లో సంధ్యారాణి పాల్గొన్నారు.



కల్యాణానికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న సర్పంచ్ సీతారామకృష్ణ

సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన సమస్యలు పరిష్కరించాలని పలువురు ఐటిడిఎ పిఒ బి.నవ్యకు వినతిని అందజేశారు. సోమవారం స్థానిక ఐటిడిఎలో పిఒ ఆధ్వర్యాన స్పందన కార్యక్రమం నిర్వహించారు. కడగండి గ్రామానికి విద్యుత్ సదుపాయం కల్పించాలని రమణ విన్నవించారు. గన్నర గ్రామానికి చెందిన సుక్కయ్య ఇంటి స్థలం ఇప్పించాలని, లోకొండకు చెందిన కృష్ణారావు నీటి ఇంజను మంజూరు చేయాలని విన్నవించారు. కిట్టలపాడుకు చెందిన కె.హేమలత కుట్టుమిషన్ ఇప్పించాలని, తుంబకొండకు చెందిన దేశమ్మ ఇంటిపైన విద్యుత్ తీగలను తొలగించాలని కోరారు. ఈ స్పందన కార్యక్రమంలో 22వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డిడి నగేష్, ఒఎస్‌డి యుగంధర్, సిడిపిఒ రంగలక్ష్మి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ పిఒకు వినతిని అందజేస్తున్న గిరిజనులు